# పరాజిత

"ఉత్తర"

అమ్మాయిల నవ్వులతో అబ్బాయిల అల్లరితో ప్రతిధ్వనించి పోతోంది అడివి. కొమ్మలకు ఫ్లాస్కులూ, ఎయిర్ బాగ్‌లూ వేలాడుతున్నాయి. బోటనీ టూర్‌కు అక్కడికి వచ్చిన విద్యార్థి బృందం, పువ్వులనూ మొక్కలనూ సేకరించడం పూర్తయిన తర్వాత తీరిగ్గా ఆ మధ్యాహ్నాన్ని ఎంజాయ్ చేస్తున్నారు.

చెట్టుబోదెకు చేరబడి గిటార్ వాయిస్తున్నాడు చెంపలవరకు జుట్టు పెంచుకున్న ఒక యువకుడు. చుట్టూ కూర్చుని అర్ధనిమీలిత నేత్రాలతో ఆ గానాన్ని ఆస్వాదిస్తున్నారు నల్గురైదుగురు. మరో మూల జడివానలా జాజ్ సంగీతాన్ని వినిపిస్తున్న రికార్డ్ ప్లేయర్‌కు అనుగుణంగా యిద్దరు అడుగులు వేస్తుంటే చప్పట్లుచరుస్తూ వారిని ఉత్తేజపరుస్తున్నారు పదిమంది. పోగుచేసిన అడివి పూలను కబుర్లు – చెప్పుకుంటూ మాల కడుతున్నారు యిద్దరమ్మాయిలు ఒకవారగా. అక్కడి కొండలనూ చెట్లనూ ఫొటోలు తీసేందుకు సరైన యాంగిల్స్ దొరక్క అవస్థపడుతున్నారు కొందరు. భయంతో, సవ్వడి చేయకుండా ఆకులమాటున సర్దుకున్నాయి పిట్టలు. ఎప్పుడూ నిశ్శబ్దంగా వుండే అడివికి హఠాత్‌గా వందనోళ్లు వచ్చినట్లు కలకలంగా ఉంది.

ఈ సంరంభంతో తనకేమీ సంబంధం లేనట్లు దూరంగా చెట్టునీడలో కూర్చుని సీరియస్‌గా ఏదో రాసుకుంటున్నాడు శశాంక. మధ్య మధ్య తలెత్తి గుంపుగా కూర్చుని ట్రాన్సిస్టర్ వింటున్న ఆడపిల్లలవైపు చూస్తున్నాడు. స్నేహితులు అతన్ని భావకవి అంటారు. ఏదో ఆలోచిస్తున్నట్లుండే కళ్ళూ, నల్గురిమధ్య కూడా ఒంటరిగా వుండే అతని తీరూ అతనికా పేరు సంపాదించి పెట్టాయి అడపాదడపా కవితలు రాస్తుండడం మరో కారణం కావచ్చు.

ట్రాన్సిస్టర్ ఆగిపోయింది. కాసేపు కలగా పులగంగా వినిపించిన అమ్మాయిల మాటలు అతను పట్టించుకోలేదు. ఇంతలో సన్నగా గాలిలో తేలివచ్చి అతని చెవులను తాకింది ఒక మృదువైన కంఠస్వరం. వెంటనే రాయటం ఆపివేసి నిటారుగా కూర్చుని శ్రద్ధగా ఆ పాటను వినసాగాడు శశాంక. కారణం ఆ పాడుతున్న అమ్మాయి అమృత.

అతను కూర్చున్న ప్రదేశం నుండి ఆమె వెనుక భాగం మాత్రమే కన్పిస్తోంది. నల్లగా, ఒత్తుగా, వీపు చివరి వరకూ వేలాడుతున్న జడ, ఎర్రని జాకెట్‌కూ, చీర అంచుకూ మధ్య మెరుస్తున్న సన్నని నడుము ఒక్క క్షణంబాటు రెప్ప వేయకుండా చూసి తిరిగి రాసుకోవడంలో మునిగిపోయాడు.

ఎన్ని నిమిషాలు దొర్లిపోయాయో? అతను మళ్లీ తల యెత్తి చూసేసరికి ఆమె అక్కడ లేదు. ఆదుర్దాగా నాలుగు వైపులా వెతికాయి అతని కళ్లు. దూరంగా చెట్ల చాటునుండి ఎర్రని చీరకొంగు రెపరెప లాడుతూ కనబడింది.

రికార్డ్ ప్లేయర్ మోగుతూనే ఉంది. అక్కడ గుంపు ఎక్కువైంది. గిటార్ కుర్రాడు సుషుప్తిలోకి జారిపోయాడేమో! చుట్టూ ఉన్నవారు జారుకొన్నారు. అందరూ ఎవరి గొడవలో వారు ఉన్నారు. మెల్లగా రాతిపైనుండి దిగి లాల్చీ దులుపుకుని నిదానంగా నడక సాగించాడు శశాంక.

"ఏం చేస్తున్నా విక్కడ, ఒంటరిగా?"

ఉలిక్కిపడి వెనక్కు తిరిగి చూసింది అమృత.

"అటుచూడు.." ఆమె తర్జని చూపిన వైపు ఒక మనోజ్ఞ దృశ్యం.

దూరంగా కొండల మధ్యనుండి మెలికలు తిరిగి పారుతున్న సెలయేరు. నీలి ఆకాశమే కరిగి ప్రవహిస్తున్నట్లుగా ఉంది.

"అద్భుతం మాతా! ఎంతసేపయినా ఇలాగే చూస్తూండ బుద్ధి వేస్తోంది."

"ఆ అల్లరీ, హోరూ విసుగుపుట్టి ఇలా వచ్చేశాను.."

గాలికి అల్లల్లాడుతున్న ముంగురులను వెనక్కి నెట్టుకుంటూ అంది అమృత.

"నీచేతిలోఏమిటి? ఏదోరాస్తున్నావల్లే ఉందే?"

"ఓ. యిదా?" నవ్వేస్తూ చేతిలోని కాగితం వంక చూశాడు.

"ఒక గేయం రాస్తున్నాను."

"వినవచ్చా?" మామూలుగా అడిగింది.

'నీకు కాకుంటే ఎవరికి వినిపిస్తాను?' అని మనసులో అనుకుని పైకి మాత్రం "అవశ్యం" దగ్గర్లోనే ఉన్న రాతిమీద ఆసీనుడయాడు. నాల్గు పంక్తులు చదివి, "ఎలా ఉంది?" అని అడిగాడు.

"బాగుంది ... ఎవరో అమ్మాయిని గురించి రాసినట్లున్నావు?"

"అవును. ఊహాసుందరి" తొణక్కుండా జవాబిచ్చాడు

"అలాగే అనుకున్నానులే. లేకుంటే అంత అందమైన వాళ్లుంటారా అని..."

శశాంక వెంటనే జవాబివ్వలేదు.

"అందం అనేది చూసేవారినిబట్టి ఉంటుంది. మాతా! తావలచింది రంభ అనే లోకోక్తి వినలేదూ?"

"అయితే మాత్రం? చంద్రకాంతిలాంటి ఛాయా, నల్లని చీకటిలాంటి కనురెప్పలు, సంధ్యాకాంతి అద్దిన చెక్కిళ్ళూ.. ఇవన్నీ వుంటాయా ఎక్కడైనా?" ఒకసారి భుజాలు ఎగరేసి సర్దుకుంటూ, "ఏమో బాబూ! నాకివన్నీ అర్థంకావు. కవిత్వం అంటే సహజత్వానికి దగ్గరలో వుండాలి..." అంది.

"అంటే ... ఎలా?" కుతూహలంగా ఆమె కళ్లలోకి చూస్తూ అడిగాడు.

"అంటే..." అని ఆలోచించి "అంటే... అమ్మాయి అన్న తర్వాత పొట్టిముక్కో, చింకికళ్లో, చేటచెవులో.. ఏదో ఒకటి వుండాలి..." అని కిలకిల నవ్వింది.

"నా కవిత్వాన్ని ఆటలు పట్టిస్తున్నావుకదూ! నీలో ఇంకా చిన్నప్పటి అల్లరి పోలేదు మాతా..." సుతారంగా ఆమె నెత్తిమీద ఒక మొట్టికాయ వేశాడు.

ఇద్దరూ చిన్నతనంనాటి జ్ఞాపకాలలో మునిగిపోయారు.

తినటం, తిరగటం, ఆడుకోటం తప్ప వేరే ధ్యాస లేని రోజుల్లో డాభామీద కూర్చుని, దూరంగా విరిగిపడుతున్న సముద్రపు అలలను చూస్తూ చెప్పుకున్న కథలు, ఆ యిసకలో గూళ్లు కట్టుకుంటూ వేసుకున్న జగడాలు, చిట్టిచిట్టి తగాదాలు, రాజీకి రావడాలు గుర్తుతెచ్చాడు శశాంక.

"ఆరోజులన్నీ బంగారుకలలు, మాతా! ... అవి అలాగే నిలచిపోతే ఎంత బాగుండేది? ." కనులు మూసుకుని మెల్లగా అన్నాడు.

"నాకు ఇప్పుడూ బాగానేవుంది. కోరుకున్నవి దొరుకుతున్నప్పుడు గతాన్ని గురించి ఆలోచించవలసిన పని ఏముంది?"

గట్టుమీదనుండి దిగి, చేతులు దులుపుకుని నడక సాగించింది అమృత.

"నిజం అమృతా! నేను కోరుకునే నీ సాన్నిహిత్యాన్ని కోల్పోయాను కనుకే గతంలోకి పరిగెడుతున్నాను నేను. మనమధ్య అడ్డుగోడ లేపిన ఈ వయసూ...అంతస్థూ...తెలియని ఆ రోజులే నాకు ప్రియతమమైనవి..."

ఆమె వెనకే అడుగులు వేశాడు భారంగా

* * *

ప్రియమైన అమృతా,

నేను కవి నంటారు అందరూ. కనబడని అందా లెన్నో ఊహించి రాసిన నాకు ఒక చిన్న విషయం చెప్పేందుకు మాటలు దొరకడంలేదు. నా మనసులో మాట నీతో చెప్పేందుకు ఇన్నాళ్ల ఆలస్యం చేశానెందుకో?

నేను నిన్ను ప్రేమించాను... ప్రేమిస్తున్నాను. నువ్వేమాత్రం గమనించినా ఈ విషయం నేను చెప్పనవసరం లేకుండానే గ్రహించి ఉండేదానివి.

జీవితం నీకు అన్ని సదుపాయాలనూ అందించింది. ఏ విషయాన్నీ సీరియస్‌గా ఆలోచించే అలవాటు నీకు లేదు. సరదాగా మామూలుగా తిరిగే

నీ చుట్టూ నా ఊహలు అల్లుకున్నాను  నా ఊహా సుందరివి, ఇన్స్పిరేషన్‌వి నువ్వే

వివాహం చేసుకుని వేరొకరి యింటికి వెళ్ళిపోయావు  నీకీ మాటలు అనవసరంగా అన్పించవచ్చు కాని నా మనసులోని భావనలు నీకు తెలియటం నా కెంతో అవసరం  ఎందుకంటే అవి నిన్ను గురించినవి, నీ చుట్టూ అల్లుకున్నవి కనుక  నీకు తెలియనప్పుడు వాటికి ప్రయోజనమే లేదు

నువ్వు నా కందుతావనే ఆశ లేదు  నీ దిన చర్యలో ఒక నిముషమైనా నన్ను గురించిన ఆలోచనలకు కేటాయిస్తావని అనుకోను  కాని నా మనసు నిండా, తలపులనిండా నువ్వే నిండి ఉన్నావు  నీకు తెలియనివ్వకుండా నిన్ను గురించిన ఆలోచనలు నాలో ఉంచుకోవటం నేరమనిపించింది  అయినా వాటిని



నీకు తెలియచేసినంత మాత్రాన తప్పు లేదనుకుంటాను

జీవితాంతమూ నీ ఊహలు నాలో ఇలాగే మిగిలిపోతాయి  ఆ ఊహల్లోనే నా సర్వస్వం ఇమిడి ఉంది

ఇట్లు,
మనసా నీ
శశాంక

సోఫామీద ఒత్తిగిలి మరోసారి చదువుకుంది అమృత  ఉత్తరం మడిచి ఒక క్షణంపాటు ఆలోచనలో మునిగిపోయింది  సన్నగా చామన–ఛాయలో ఉండే శశాంక రూపం మసకగా మెదిలింది మనో పథంలో  అంతకు మించిన వివరాలేవీ గుర్తు రాలేదు  అతని రూపు రేఖాదులూ, మాటలూ మరింత స్పష్టంగా గుర్తు తెచ్చుకోవాలని ప్రయత్నించి విఫలురాలైంది  ఉత్తరాన్ని అప్రయత్నంగా బీరువా తెరచి సొరుగులో పడేసింది

'జీవితాంతమూ నిన్ను గురించిన ఊహలు నాలో మిగిలిపోతాయి...' అంటే పెళ్లి చేసుకోడా ? కాసేపు ఆ విషయం ఆలోచించబోయి మానేసింది తన కనవసరం అన్నట్లు

ఆకాశంనిండా మబ్బులు అలుముకున్నాయి

'వాన వచ్చేలా వుంది  ఒంటరిగా యింట్లో కూర్చోవాలంటే విసుగు  వాసవ ఇంకా రాలేదేమిటో ?'

ఏనుగుల గుంపుగా తరలివస్తున్న బూడిద రంగు మబ్బులను చూస్తూ నిట్టూర్చింది అమృత.

పెళ్లయి యింకా రెండునెలలైనా కాలేదు  కొత్తదనపు మోజు, ఉత్సాహం ఏమీలేవు తనలో  తెల్లగా, కొద్దిగా లావుగావుండే వాసవ పెద్దవాడిలా అనిపిస్తాడు  అతడొక బాధ్యత గల ఆఫీసర్ కావచ్చు కాని బాధ్యత గల భర్తమాత్రం కాదు  కంపెనీ పను




లన్నీ తనమీదే వున్నట్లు రోజూ పొద్దుపోయి ఇంటికి రావటం, రొటీన్‌గా ఏదో సంజాయిషీ యిచ్చుకోవటం ... విసుగెత్తిపోతోంది అమృతకు  ఆరోజు నిలదీసి అడగాలని నిశ్చయించుకుంది

అసహనంగా పచార్లు చేస్తున్న అమృత  ఫోను మోగడంతో వెళ్లి అందుకుంది

"డార్లింగ్ ! మిస్టర్ ఇరానీ ఇంట్లో డిన్నర్ ఉంది  నాకోసం చూడక భోంచేసి పడుకో ! గుడ్‌నైట్.. "

రోషమూ, దుఃఖమూ కలిసి ఒకేసారి తోసుకొచ్చాయి అమృతలో.

'ఇంకానయం  ఫోను చేయాలనైనా తట్టింది' అనుకొంది కసిగా.

మొట్టమొదటిసారిగా  అమృత కళ్లలో నీళ్లు చిమ్మాయి.

వాసవ నిర్లక్ష్యానికి తానెందుకింతగా బాధపడుతోంది ? అతన్ని ప్రేమిస్తోందా ? ప్రేమ అంటే సిల్లీ అనుకునే తను వాసవను ప్రేమించటమా ? ఉహూఁ ... కాదు  భార్యగా తనకొక విలువ నివ్వలేదే అని బాధపడుతోందంతే. ఎలాగైనాసరే తమిద్ద

రకూ మధ్యనున్న మంచుతెర ఏదో విచ్చుకునేలా చేయాలి.

*   *   *

అతిధులతో హాలు కళకళ లాడుతూంది. గాజు గుత్తులలోని దీపపు కాంతులు విస్కీ గ్లాసులమీద, వాటిలోని ఎర్రని ద్రవంమీద పడి చెదిరిపోతున్నాయి. ఇంచుమించు మగవాళ్లందరూ సూట్‌లు ధరించి వున్నారు ఆడవాళ్ల అలంకరణ విపరీతంగా వుంది. ఎత్తుగా చుట్టిన సిగలూ, రంగులు చిమ్ముతున్న ఆర్టిఫిషియల్ రాళ్ల నగలూ, వత్తుగా రంగు దిద్దిన పెదవులూ, కళ్లూ అంతా కృత్రిమంగా వెగటుగా అన్పించినా, బలవంతాన నిగ్రహించుకుని [illegible]జీ మర్యాదను పాటిస్తూ ఆతిధ్యం నిర్వ[illegible]త్తింది అమృత

పార్టీకి ఇరానీ దంపతులు వచ్చినప్పటినుండి ఆమెలో అలజడి ఎక్కువైంది సన్నగా బలహీనంగా, భార్యా విధేయుడిలా కన్పించే మిస్టర్ ఇరానీ ప్రక్కన లావుగా తెల్లని పిండిముద్దలా కనబడుతోంది మిసెస్ ఇరానీ ముదురురంగు ఫారిన్ నైలక్సుమీద వెండి జరీ చేసిన చీర వంటికి చుట్టబెట్టినట్లుగా వుంది

'వెకిలి వేషాలంకరణతో పరాయి మగవాళ్లని తనచుట్టూ తిప్పుకునే ఈ మనిషి సభ్యప్రపంచంలో వ్యక్తి పైగా సంఘంలో ఉన్నతవర్గానికి చెందినది కూడాను ఏం బుద్ధులో! మతిపోయినట్లు వెంట బడే ఈ మగవాళ్లని అనుకోవాలి ఛీ ఛీ .'

మిసెస్ ఇరానీ వచ్చినప్పటినుండి ప్రత్యేకమైన శ్రద్ధను చూపిస్తూ ఆమెవెంటే తిరుగుతున్న భర్తను చూసి చీదరించుకుంది అమృత

తన భర్త వేసిన జోక్‌కు వళ్లంతా కదిలి కదిలి నవ్వుతున్న ఆమెను చూస్తున్నకొద్దీ జుగుప్స, అసహనం ఎక్కువైపోసాగాయి అమృతలో

క్రిందటిరోజు సాయంత్రం జరిగిన సంఘటన మనసులో మెదిలి ఆమె కోపాన్ని మరింత ఎక్కువ చేసింది

వంటరిగా యింట్లో ఏమీ తోచక కారు తీసుకుని బజారుకు బయలుదేరింది విండో షాపింగ్ చేస్తూ మెల్లగా వెళుతున్న తనకు ముందుకు దూసుకుపోయిన కారులో మిసెస్ ఇరానీ ప్రక్కన తన భర్త కనిపించగానే షాక్ తగిలినట్లయింది స్పీడు హెచ్చించి జాగ్రత్తగా ఆ కారును వెంబడించింది

సేఠ్ హీరాలాల్ షాపుముందుఆగిన కారులోనుండి దిగి, ఇద్దరూ లోనికి వెళ్లారు అరగంట తర్వాత నవ్వుకుంటూ బయటికి వచ్చిన వారిని చూడలేక అవమానంతో రోషంతో వెనక్కుతిరిగి వచ్చేసింది

రాత్రి భర్త నిద్రిస్తున్నప్పుడు చప్పుడుకాకుండా అతని డ్రాయరు తెరచి చెక్‌బుక్ చూసింది తన అంచనా నిజమే అని నిరూపించింది సేఠ్ హీరాలాల్ పేర ఇచ్చిన అయిదువేల రూపాయల చెక్

డిన్నర్ పేరిట తన భర్త తరచూ మిస్టర్ ఇరానీ ఇంటికి ఎందుకు వెళుతుంటాడో పూర్తిగా అర్థమయింది కళ్లముందు తెరలేవో విచ్చుకున్నట్లూ, తానేదో అగాధంలోకి జారిపోతున్నట్లూ ఫీలయింది ఒక్కక్షణం ఏం చేయాలో తోచని అగమ్యం . మరుక్షణమే ఆపుకోలేని దుఃఖం. మనసారా ఏడ్చేసింది దుఃఖమంతా కొట్టుకుపోయాక స్థిమితంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది

'ఎలాగైనా వాసవను తనవైపు త్రిప్పుకోవాలి. మన మనసును చంపుకునైనాసరే అతని మనసును కరిగించాలి !'

"డియర్ ? ఈ రోజు పాల్ వస్తున్నాడు చిన్న పార్టీ లాంటిది ఇవ్వాలి మనం సాయంత్రం ఆ ఎరేంజిమెంట్స్ అన్నీ చూసుకుంటావుగా ?" అని ఉదయం భర్త అడిగినపుడు నిశ్చలంగా "అలాగే" అంది రాబోయే అతిధులలో ఇరానీలు ఉంటారని తెలుసు. 'చూడాలి తనెంతవరకు నటించగలదో ?'

"మిసెస్ వాసవ ! ఊహాలోకాల్లో ఉన్నారు !"

ఉలిక్కిపడి చూసింది అమృత మిసెస్ ఇరానీ నవ్వుతోంది పళ్లన్నీ బయటపెట్టి అతిధులందరూ వెళ్లిపోయినట్లున్నారు, హాలు ఖాళీగా ఉంది.

"మేమూ వెళ్లివస్తాం ఇక ఈ రాత్రి చాలా బాగా గడిచింది" అని వాసవ వైపు తిరిగి ఒక కన్ను మూసి నవ్వి "చాలా థాంక్స్ మరి, గుడ్ నైట్" అని బయలుదేరింది

మిస్టర్ ఇరానీ కూడా థాంక్స్ చెప్పి ఆమె ననుసరించాడు

వారిని కారు వరకూ సాగనంపటానికి వెళ్లిన వాసవను చూస్తుంటే అప్రయత్నంగానే చిన్నవయ్యాయి అమృత కళ్లు అసహ్యంతో విస విస నడుస్తూ మేడపైకి వెళ్లిపోయింది

"డార్లింగ్ ! ఏమిటలా చూస్తున్నావ్ ?"

కిటికీలో నుండి దట్టంగా చీకటి కమ్ముకున్న ఆకాశాన్నీ అక్కడక్కడా వెలుగుతున్న తారలనూ చూస్తున్న అమృత వెనక్కు తిరిగింది

సన్నని విస్కీ వాసన, సెంటు వాసన కలిసి వెగటు కలిగిస్తుంటే కంపరంగా చూసింది వాసవ వైపు

"చాలా అలిసిపోయి నట్లున్నావు నిద్రపోయి ఉంటావనుకున్నాను" దగ్గరగా వచ్చి బుజంపై చేయి వేశాడు ముఖం తిప్పుకుంది అమృత.

"కమాన్ మై ప్రెటీ "

నడుంచుట్టూ చేయివేసి నడిపించబోయాడు

అమృతలోని అంతరంగం ఎదురుతిరిగింది.

'తానేమీ మరబొమ్మ కాదు, యాంత్రికంగా అతడు చెప్పినట్లు చేయటానికి అతనికి బానిసా కాదు పడిఉండటానికి.. '

విసురుగా విదిలించి కొట్టింది తనను చుట్టుకుంటున్న చేతిని.

ఒక్క క్షణం ఏమీ అర్థం కానట్లు చూశాడు వాసవ చిన్న గొంతుతో "కోప మొచ్చిందా, డియర్ ?" అని అడిగాడు నిశితంగా చూస్తూ.

అమృత పలుకలేదు

"ఆల్‌రైట్ నీ కోపం తగ్గాకే రా ."

నిర్లక్ష్యంగా వెళ్లిపోయాడు బెడ్ వద్దకు

"మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలి నేను" అతనివెంటే నడుస్తూ అంది

ఒక లాయరుగారు ఆఫీసు గదిలో కూర్చుని ఉండగా కొత్త మనిషి లోపలికి రావటం చూసి కాబోయే ఖాతాదారు కావుననుకుని టెలిఫోను ఎత్తి, "క్షమించండి ! నేను వెయ్యి రూపాయలకి తక్కువ ఫీజు పుచ్చుకోలేను." అని పెట్టేశాడు.

లోపలికి వచ్చిన మనిషి వయిపు తిరిగి, "నాతో పనేమయినా ఉందా ?" అని అడిగాడు

"మీతోకాదు మీ టెలిఫోనుతో ! దానిని బాగు చెయ్యటానికి వచ్చాను " అని కోమ జవాబు చెప్పాడు.

"అడిగి తీరాలంటే అడుగు "

"మిసెస్ ఇరానీతో మీకేమిటి సంబంధం ?"

"అది నీ కనవసరం " రాయిలాగా బిగుసుకుపోయింది వాసవ ముఖం

"భర్త ఒక ఆడదానికి అయిదువేలు ఖరీదు చేసే రవ్వలనగలు కొనిపెడుతుంటే కారణం తెలుసుకోవలసిన అవసరం భార్యకు లేదూ ?"

మంచం అంచుపై కూర్చుని, అతని ముఖంలోని భావాలు చదవటానికి ప్రయత్నించింది

"ఓ...చాలానే తెలుసుకున్నావు" వెటకారంగా అన్నాడు వాసవ "నామీద నిఘా వేశావన్నమాట భార్యా ధర్మం చాల చక్కగా నిర్వర్తిస్తున్నావు "

"నా ప్రశ్నకు సమాధానం అదికాదు "

"చూడు డియర్," పడుకున్నవాడల్లా లేచి మోచేతిపై ఆనుకుని కూర్చున్నాడు "నేనెవరికి ఏం కొనిస్తానో నీకు పూర్తిగా అనవసరం నీకేమైనా కావాలంటే అడుగు కొనుక్కో అంతే నీ హద్దులు దాటి నాకు చీకాకు తెప్పించకు "

హద్దులుదాటి . కొరడా దెబ్బలాగ తగిలింది అమృతకు

"నేను కూడా నా యిష్టమొచ్చినవారితో తిరిగితే "

"తిరుగు నాకేం అభ్యతరంలేదు" దుప్పటిలోకి దూరిపోయాడు

"అభ్యంతరంలేదూ ?" నిప్పులు చిమ్ముతున్నాయి అమృత కళ్లు.

"అవును మీకు అభ్యంతరం వుండదు. కాని నాకు ఇంగితం వుంది భర్తపట్ల ధర్మంతప్పి నడవటం నాచేతకాదు. "

చివాలున దుప్పటి తన్నేసి లేచి కూర్చున్నాడు వాసవ

"ఓ.. వెరీగుడ్" తల పంకిస్తూ వెటకారంగా "మోడర్న్ సీతవా, సావిత్రివా ?"

"చూడండి . ఈ ఇంట్లో నాకూ సగం అధికారం ఉంది" అతని మాటలను వినిపించుకోనట్లే చెప్పుకుపోయింది అమృత ఇటువంటి వ్యవహారాలు హర్షించను నేను, ఇకనుండీ మిసెస్ ఇరానీ కాని మరే ఆడది కాని మిమ్మల్ని కలుసుకోకూడదు..."

"ఆంక్షలు పెడుతున్నావా ?"

[ 28 వ పేజీ చూడండి ]

మైనది. అస్థి, అంతకుమించిన అంతరంగం వున్న నేను, అతి సామాన్యమైన జీవితపథంలో నడుస్తూనే, అమూల్యమైన జీవిత సిద్ధాంతాన్ని సాధించాను. పబ్లిక్ ప్రాసిక్యూటరుగా, నిండుమనిషిగా, ప్రేమికునిగా జీవితానికి ఎదురీదేను'' అన్నారు చలం. ఈ చిత్రానికి రాజశ్రీ రచనను, మధు ఛాయను, సత్యం సంగీతాన్ని నిర్వహించారు దర్శకుడు నాగాంజనేయులు. ఈ చిత్రంలో కాంతారావు, పద్మనాభం, రమాప్రభ, మమత, సాక్షిరంగారావు ముఖ్యపాత్రధారులు. శ్రీసిలింక్ విడుదల.

**పైవారమే**
**శోభన్‌పై ప్రత్యేక వ్యాసం**

---

## పరాజిత

(23వ పేజీ తరువాయి)

''కాదు. ఖచ్చితంగా చెబుతున్నాను ''

''సరే, నేనూ ఖచ్చితంగానే చెబుతున్నాను విను. భార్యేకాదు, నన్ను సృష్టించిన దేవుడైనా సరే వచ్చి నా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సహించను నేను. నీకిష్టంలేకుంటే నిశ్శబ్దంగా ఈ యింటి నుండి వెళ్ళిపో. విడాకులు కావాలంటే కోర్టుకెక్కు. లేదంటే, రాజీపడదలచుకుంటే మౌనంగా ఉండిపో. మామూలుగా ఉందాం అంతేగాని, నా ఆనందానికి నాకూ మధ్య వచ్చావంటే సహించేది లేదు ఇదే మొదటిసారీ ఆఖరుసారీ చెబుతున్నాను మళ్లీ ఈ ప్రసక్తి తేవద్దు ..''

* * *

''ఆ మనిషిని లాలించి, బెదిరించి లాభం లేదని తెలిసిపోయింది అతనంత ఖచ్చితంగా చెప్పేసిన తర్వాతగూడా కొన్ని నెలలపాటు ప్రాకులాడాను, నా స్థానం నిలుపుకుందామని కాని మనసు చంపుకోవటం నా వశం కాకపోయింది నేనెంత ప్రయత్నించినా మా మధ్య దూరం పూడలేదు ఇలా వచ్చెయ్యటం తప్ప వేరే గత్యంతరం తోచలేదు నేను చేసింది తప్పంటావా, శశీ ?''

బేలగా అడుగుతున్న అమృతవైపు ఒక క్షణం పాటు రెప్ప వేయకుండా చూశాడు శశాంక అప్పటికీ ఇప్పటికీ ఆమెలో ఏదో మార్పు వచ్చింది అది కళ్లలోనే ఉన్నట్లుంది

చీకూ చింతా లేక, గలగల నవ్వుతున్నట్లుండే ఆ కళ్లు వేరు దిగులూ, సమస్యలూ ప్రతిబింబింప జేస్తున్న ఈ కళ్లు వేరు ఒడిలో ఉంచుకున్న అరిచేతులను చూస్తూ తీవ్రంగా ఏదో ఆలోచించాడు

'ఇక్కడికే రావాలని ఎందుకనుకున్నావు ? నేను రాసిన ఉత్తరంవల్లనా ?'' అనుమానంగా అడిగాడు. ''నువ్వు గిల్టీగా ఫీలవుతున్నట్లున్నావు ? అతని మనసులోని భావాలను చదివినట్లే అన్నది అమృత ''నా నిర్ణయానికి నీ ఉత్తరం ఒక సాధనమే కాని కారణంకాదు దాని కారణంగా నా భర్తను నిర్లక్ష్యం చేసివచ్చానని అనుకోవద్దు ''

చేతులు కట్టుకుని పచార్లు చేయసాగాడు శశాంక

''పెళ్లి కాకముందు, మనసనేది ఒకటి ఉందని తెలియని రోజుల్లో, నిర్విచారంగా ఉండేదాన్ని. కోరుకున్న వస్తువులు దొరికితేచాలు నా కప్పట్లో అంటే భౌతికానందంతో సంతృప్తిపడి ఊరుకునేదాన్ని మానసికమైన ఆనందం వేరేఉందనీ, అది భౌతికానందానికన్నా ముఖ్యమైనదనీ కూడా నాకు తెలియదు డబ్బు ఆ రకమైన ఆనందం ఇవ్వగలదేమో గాని, మనసును రంజింప జేసేవి మాత్రం అనురాగం, ఆత్మీయత అవే లోపించాయి నా వైవాహిక జీవితంలో. అవేమీ పట్టించుకోకుండా మరబొమ్మ లాగ బ్రతికేసేదాన్నేమో, కాని నీ ఉత్తరం నాలో నిద్రాణమైఉన్న భావనలను, స్పందనలను తాకి మెలుకువ తెప్పించింది ''

మధ్యలో ఆపి అతని వైపు చూసింది అమృత.

''భర్త అంటే డబ్బు సంపాదించి ఇచ్చే యంత్రం కాదుగా! అతని నుండి అపేక్ష, అంత కరుణా కోరటం నా తప్పా ?''

''కాదు... చెప్పు''

''సిరిసంపదలు లేకున్నా ఫర్వాలేదు, నేను కావలసిన వ్యక్తి, నన్ను ప్రేమించే వ్యక్తి కావాలనిపించింది. నా ఆలోచనలలో ఈ మార్పుకి నీ ఉత్తరమే కారణమనవచ్చు అందులో ఏం రాశావో గుర్తుందిగా?''

''ఊఁ''

''నన్నింకా అప్పటిలాగానే ప్రేమిస్తున్నావా?''

''అప్పటికీ ఇప్పటికీ నా భావాల్లో మార్పు రాలేదు, రాదుకూడా అయితే నన్నేం చేయమన్నావు ?''

హతాశురాలైనట్లు చూసింది అమృత

''అంతా విని ఈ ప్రశ్న అడుగుతున్నావా ? నీకేం అర్థంకాలేదూ ?''

''నిజం అమృతా! నాకేం తోచటంలేదు ఏం చేయమన్నావు ?''

''నన్ను .. నన్ను ... పెళ్ళిచేసుకో ... ''

పచార్లు చేస్తున్న వాడల్లా ఆగి, ఆమె కళ్ళలోకి నిశ్చలంగా చూశాడు కళ్లు వాల్చుకుంది- అమృత

'సిగ్గు విడిచి అడిగాననుకుంటున్నావా, శశీ ? ఒకప్పటి అమృతను కాదిప్పుడు కొన్ని నెలల సంఘర్షణా, వేదనా మార్చేశాయి నన్ను నీకు కావలసిన మానసికమైన తృప్తినీ, ఆనందాన్నీ ఇవ్వగలనిపుడు నేను, నిజం ... నమ్ము శశీ! మాట్లాడవేం ? ఓ ... తెలిసింది పెళ్లయి కొన్నాళ్ళు కాపురం చేసిన మనిషిని మళ్లీ ఎలా పెళ్లాడనా అని ఆలోచిస్తున్నావు కదూ !''

''కాదు ''

''మరి ? ఉత్తరంలో అంతటి అనురాగం వ్యక్తపరచి కోరివస్తే కాదంటున్నావేం ? ప్లీజ్ ! నీ కిష్టంలేకుంటే చెప్పెయ్! బతుకు బరువై రాలేదు నీ వద్దకు. నా మీద అభిమానం ఉండే నీ జీవితం పంచుకుందామని వచ్చాను.''

రోషంతో, పౌరుషంతో మాట్లాడుతున్న అమృతను మధ్యలోనే ఆపివేశాడు శశాంక.

''నువ్వు పొరపాటు పడుతున్నావు, మాతా! నీ మీద నా కున్న అనురాగమూ, అభిమానమూ ఏమాత్రం తగ్గలేదు నా ఊహల్లో ఎప్పటికీ ఉంటావు నువ్వు నీకు పెళ్లి కావడంకాని, నీ భర్తను వదిలేయటంగాని ఆ ఊహలను పాడు చేయవు కాని నిన్ను ప్రేమించటం వేరు. పెళ్లాడటం వేరు...''

''ఏం ? ఎందుకని ? ముందంతా కబుర్లు చెప్పి, సమయం వచ్చేసరికి జారుకునే అందరిలాంటి వాడివేనా నువ్వుకూడా ?''

''ప్లీజ్ ! ఆవేశపడకు మాతా! నేను అవకాశవాదిని కాను అందుకే నిన్ను పెళ్లాడలేనంటున్నాను.''

''చాలా థాంక్స్. ఇప్పటికైనా చెప్పావు అసంగతి ''

విసురుగా లేవబోయిన అమృతను బలంగా బుజం పట్టి కూర్చోబెట్టాడు.

''నా మాటలు చివరివరకు విని వెళ్లు ఎందుకు నన్ను నిందిస్తావు అకారణంగా ? నీ చేతిలో పావుగా ఆడితేనే నిన్ను ప్రేమించినట్లు లెక్కా ?''

''నా చేతిలో పావుగానా?.. '' అవాక్కయినట్లు చూస్తుండిపోయింది

'కాక మరేమిటి ? ముందీ ప్రశ్నకు జవాబు చెప్పు, వాసవనుండి విడిపోవాలనే ఆలోచన రాక ముందు అతనితో కలసివున్న ఆరు నెలల్లోనూ నన్ను గురించి ఒక్కమారైనా అనుకున్నావా ?''

తల అడ్డంగా ఆడించింది అమృత

''అంటే ... అతన్ని మార్చలేనని రూఢి అయాకే నా దగ్గరకు వచ్చావు నువ్వు అతను ఏమాత్రం మారినా అక్కడే ఉండిపోయేదానివి ... అవునా ?''

అమృత పలకలేదు.

''ఎవరు అవకాశవాది అమృతా ? నేను నిన్ను ప్రేమిస్తున్నమాట నిజమే కాని నీతో జీవితం పంచుకోవాలంటే నువ్వుకూడా నన్ను ప్రేమించాలి. ప్రేమ ఒకే వైపునుండి ప్రవహించినా రాణిస్తుందేమోకాని, పెళ్లికి మాత్రం అనురాగం రెండు వైపులనుండి రావాలి, అమృతా ! బొంబేలో ఉన్న రోజుల్లో ఒక్కసారైనా, కనీసం నా ఉత్తరం చేరిన తర్వాతనైనా నన్ను గురించి ఆలోచించావనీ, నన్ను కలుసుకోవాలని తహతహ లాడావనీ చెప్పి ఉంటే సంతోషించి ఉండేవాడిని. మనస్ఫూర్తిగా నిన్ను వివాహం చేసుకుని ఉండేవాడిని...

నీకు, డబ్బుకూ, రక్షణకూ కొదువలేదు. ఈమారైనా నువ్వు ప్రేమించినవాడిని, నిన్ను కోరుకున్నవాడిని చేసుకో అమృతా! అప్పుడే సుఖపడతావు. లేకుంటే నాలాగే ఒంటరిగా మిగిలిపోవాలి...''

బరువుగా ముగించాడు శశాంక చివరి మాటలు పలుకుతున్నపుడు అతని గొంతు జీరబోయింది

దోసిట్లో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్వసాగింది అమృత